ఉంటే వచ్చే ఎందుకు ఏరుకోవా?' అని అడిగావేం?"

నీరజ ముఖం వికసించింది.

"మీ ధోరణి ఏమిటో! పోన్లెండి చెప్పక పోతే మానె!"

"కారణం ఉంటేగా చెప్పడానికి?"

"చెప్పొద్దన్నాగా."

"తరతమాలకి అంతంటూలేదుకదా నీరజా! వెతుక్కుంటూ ఎంత దూరమైనా వచ్చు. నీలో ఏ లోపమూ నాకు కనుపించలే. ఒప్పుకున్నాను. అంతే!"

"అంతేనా ?" అందామె.

ఆమె ముఖంలో కళ లేదు. ఆమె వదనం వైపు చూసి రాజగోపాలరావు నవ్వాడు

"కాదు."

"ఇదెక్కడి మనిషిరా బాబూ:"

వినుక్కున్నా ఆమె ముఖంలో పోయిన కళ మళ్ళా వచ్చింది. "అయితే ఏదో కారణం ప్రతిదానికీ ఉండి తీరాలంటావు?"

"ఈ శాస్త్ర యుగంలోనే కారణం లేదంటే ఎవరొప్పుకుంటారండీ మరీ ?"

"అయితే ఏదో ఉండాలన్నమాట"

రాజగోపాలరావు ఆలోచనగా ఆమెవైపు చూశాడు.

"నన్నేడిపించకండీ! మీకో నమస్కారం. బుద్ధి తక్కువై అడిగాను."

బుంగమూతి పెట్టింది నీరజ. తల పక్కకి తిప్పుకుంది. కళ్ళ చివరల్లోంచి చూపుల తూపులు విసిరి, తల దురుసుగా ఎగరేసి గడ్డం కింద చెయ్యి పెట్టుకుని కిటికీవైపు చూసింది.

రాజగోపాలరావుకి నవ్వు వచ్చింది.

ఒక్క క్షణం బుర్ర గోక్కున్నాడు.

"ఓస పిచ్చి పిల్లా! 'తొలి చూపులోనే ప్రేమించాను' అని పల్లె వేయటం చర్విత చర్వణం గదా! కొత్త మాట దొరుకుతుందేమో నని ఆలోచిస్తున్నాను."

"పోండి!" అందామె పెదవులపై విరిసిన లేనవ్వు అందంగా నొక్కివేస్తూ.

"మనిషిని మనిషి ఆకర్షించటం అర్థో, సైన్సో. ఈ రెండూకావో తెలీకుండా ఉంది. అసలు ఆకర్షణ లేనిది నిజమో, కల్పనో!",

అర్ధస్వగతంగా అన్నాడురాజగోపాలరావు.

"మాటలకి 'టాక్స్' లేదుకాబోలు!" అంది నీరజ. రాజగోపాలరావు 'కారణం' తత్త్వాన్ని గురించి ఆలోచిస్తూనే ఉన్నాడు. నీరజమాత్రం తృప్తిగా కళ్ళుమూసుకుని బెర్తుమీద జేరగిల పడింది. □□□

# తిట్లు చివాట్లు

సైకిలుగంటలు, సైకిల్ రిక్షాల మ్రోతలూ, కారు హారన్లు, డీసిల్ బస్సుల చప్పుళ్ళు మొదలైన రణగొణ ధ్వనుల జోరును మారుపెట్టి గుణించినా ఆ చప్పుడు తెలుగు దేశపు బజారు వీధుల్లో వినిపించే బండ బూతుల్ని ముంచెత్తలేదు. ఆరేళ్ళ కుర్రాళ్ళ నుంచి అరవై ఏళ్ళ ముసిలాళ్ళదాకా, అప్పు డప్పుడు ఆడా మగా తేడాలేకుండా ఆంధ్రులు నడివీధిని బూతుల బుంగల్ని విప్పుతారు. ఈ తిట్లూ, ఒట్లూ షడ్రసోపేతమైన స్పెషల్ అట్లు. వీటిని అంటే చేదు. వింటే కారం. తింటే ఘోరం.

రతి కార్యాన్ని అతిగావాడే బూతులను మినహాయించి తదితర తిట్లు ఎందుకు పుట్టాయో పరిశీలించడం అవసరం. ఒళ్ళు తెలియని కోపంలో తెలుగువాడు అవతల వాళ్ళని చంపేస్తాడు. నరికేస్తాడు. ఒళ్ళు చీల్చేస్తాడు. చెమడా లెక్కగొడతాడు. పొక్క చింపి డోలు కడతాడు. గుడ్లు పీకేస్తాడు. నిలువునా పాతేస్తాడు.

ఆటవిక దశలో ఏ మానవుడైన కోప గిస్తే నిజంగా శత్రువుని ఇన్నీ చేసేవాడు. నాగరికత పెరిగిన తరవాత మానవుడు ఈ హింసాకార్యాలనూ, హత్యాకృత్యాలనూ అక్షరాల్లో చేస్తున్నాడుగాని అక్షరాలా చెయ్యడం లేదు. చేస్తే మొదట అర్ధదండాలు పడి ఆ తరవాత నిండుగండాలు తప్పవు.

తనలోవున్న మృగత్వాన్ని మనిషి ఇలా నోటిగుండా వెళ్ళగొట్టడం చాలా అవసరమే. మాటల్లో ఇన్ని ఘాతుకాలు చేయని వాడు చేతల్లో చాటుగా అఘాయిత్యాలు చేసే అవకాశం వుంటుంది. ఇన్ని రకాల అమానుష చర్యలను చేస్తానని బెదిరించే పెద్ద మనిషి తీరా బొద్దెంకనుచూసి భయపడవచ్చు.

రతి కార్యంతో ముడిపడ్డ తిట్లను సభ్యత గల భాషలోకి తర్జుమా చేసిన తిట్లనుకూడా తెలుగువాడు వాడి పారేస్తాడు. దీని తల్లిసిగ దరగా, దాని అమ్మకడుపు మాడా, మొదలైనవి బురఖావేసుకొన్న బూతుమాటలే. ఇలాంటి వాటిని వాడేవాళ్ళు అసలు సిసలు బూతులు వాడి మనసులో వున్నదంతా కడిగేసుకోలేని పిరికివాళ్ళు.

కోపంతో తిట్టేతిట్లు క్రమేణా హర్షింపుతో వాడే మెప్పుమాటలుగా మారిపోతాయి. 'తస్సాదియ్యా!' అనేది అటువంటి మాటల్లో ఒకటి. దాని అర్థం తెలియకుండానే చాలామంది వాడుతూ వుంటారు. 'తస్స' అంటే నిజమైన అర్థం - చర్మం అడుగున వుండే దుర్మాంసం: కొవ్వు: ఈ తస్సని చెక్కడం కొయ్యడం, తియ్యడం మొదలైన కర్మలు శత్రువుని చీల్చి చెండాడమే.

మన భాషలో తిట్లనేకాక, ఇతర భాషల బూతులను మనం తెలియకుండానే వాడేస్తూ వుంటాము. హిందీలో చెడ్డ అర్థమున్న మాటలను మెచ్చుకోడంలో తెలుగువాళ్ళు వాడడం కూడా ఉంది. 'ఓరి భడవా' అని మనవణ్ణి తాతగారు మెచ్చుకొంటారు. గాని ఆ మాటకు 'తార్పుడుగాడు' 'డాఫరు' అనే అర్థాలున్నట్టు ఆయనకు తెలిసివుండదు

ఒక ప్రాంతంలో ఆడా మగా సిగ్గుపడకుండా, బూతు అనుకోకుండా వాడే మాటలు మరో ప్రాంతంలో చెడ్డమాటలు. ఉదాహరణకి విశాఖ జిల్లాలో 'దొబ్బెయ్యడం' అంటే ఎత్తుకుపోవడం, తస్కరించడం, వెళ్ళిపోవడం మొదలైన క్రియారూపంలో వాడుతారు. ఇతర ప్రాంతాలలో యిది బూతే:

మదరాసులో అరవ - తెలుగువాళ్ళ 'చీర ఎత్తడం' అనే మాటకు 'చీర కొనడం' అర్థమే గాని తదితర దురుద్దేశం లేదు.

ఒక విధంగా తెలుగువాడు అద్వితీయుడు. తెలుగులోవున్నన్ని - తిట్లు ఇంకేభాషలో లేవనుకోవచ్చు; బహుశా పంజాబీవాడు ఇందులో మన తల దన్నవచ్చు. ఆ రెండు భాషల తిట్లు తులనాత్మకంగా పరిశీలించి ఏ ఊసుపోని పండితుడైనా, వాడిల్లు బంగారం గానూ, వ్రాయక పోతాడా ? అప్పుడు సావకాశంగా అన్నీ తెలుసుకుందాం.

— మాతృగర్భం బంగారయ్య